
సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



సర్వీస్ ఇనామ్ భూములు క్రమబద్ధీకరణ

గ్రామ సర్వీస్ ఇనామ్ భూములను ప్రభుత్వం 22ఏ జాబితా నుంచి తొలగించింది. -8లో



కడపలో భారీ అగ్ని ప్రమాదం

కడపలోని నిత్యావసర వస్తువుల హోల్‌సేల్ దుకాణంలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.5 /24.2

జిల్లాలో గురువారం 24.2 - 36.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్‌గా శ్రీధర్‌రావు



కడపవైఎస్‌ఆర్ సర్కిల్: ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) డిపో జిల్లా మేనేజర్‌గా శ్రీధర్ రావు నియమితులయ్యారు. ఈయన నంద్యాల జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండ్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా పని చేస్తున్న మహేష్ కుమార్ ఎస్‌ఈబీ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలలల్లో అడ్మిషన్స్ కోసం పాలిసెట్-2023 సర్టిఫికెట్ చేయించుకున్న విద్యార్థులు పాలిసెట్ వెబ్ ఆప్షన్లు శుక్రవారం(నేటి) నుంచి ప్రారంభం అవుతాయని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, పాలిసెట్ కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులకు ఇది వరకే తమ మొబైల్ నంబర్‌కు వచ్చిన లాగిన్ ఐడీ, తమకు ఇచ్చిన ఐ.సి.ఆర్ ఫారం ద్వారా క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ చేసుకుని రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చన్నారు. ఇందులో ఏవైనా సమస్యలు ఉంటే కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రొద్దుటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు వెళ్లి పరిష్కరించుకోవాలని పాలిసెట్ కో ఆర్డినేటర్ తెలిపారు.

14న అప్రెంటీస్ మేళా

కడప ఎడ్యుకేషన్: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ కమ్ రోజ్‌గార్ మేళా కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో 14వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ డీఎల్‌టీసీ ఏడీ రత్నరాజు గురువారం తెలిపారు. అర్హత ఉన్న వారు 10వ తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఐటీఐ ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ బుక్, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకు రావాలని ఆయన సూచించారు.

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (07489/90) మధ్య కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి తెలిపారు. ఈనెల 12, 13 తేదీలో ఈ రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. సికింద్రాబాద్‌లో 12వ తేదీ రాత్రి 10.05 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.47 గంటలకు కడపకు వస్తుందని, 9.30 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. 13వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు తిరుపతిలో బయలుదేరి కడపకు 6.43 గంటలకు చేరుకుని మరుసటిరోజు ఉదయం 4.50 గంటలకు సికింద్రాబాదు చేరుతుందన్నారు.

డ్రిప్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

కడప అగ్రికల్చర్: జిల్లాలో డ్రిప్ (బిందు, తుంపర సేద్యం) లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఏపీ ఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలో మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్లు, కంపెనీ ప్రతినిధులతో బిందు, తుంపర సేద్యం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరం ఉన్న అర్హులైన రైతులు రైతుభరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాకు 2023-24 ఏడాదికి 10,500 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 2754 హెక్టార్లకు జిల్లా కలెక్టర్ ద్వారా పరిపాలన ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలసలకు ఫుల్‌స్టాప్

- జిల్లాలో నాలుగేళ్లలో 5.47 కోట్ల పనిదినాలు
- కూలీలకు వరంగా మారిన ఉపాధిహామీ పథకం



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

కడప సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు అద్భుతంగా కొనసాగుతోంది. దీంతో జిల్లాలో వలసలు తగ్గుముఖం పట్టాయి. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సీజన్ తర్వాత పనులు లేకపోవడంతో వలసలు వెళ్లే పరిస్థితి ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ పథకంలో సొంత ఊర్లలోనే పనులు నిర్వహించడం వల్ల జీవనం సాఫీగా సాగిస్తున్నారు. వలసలకు ఫుల్‌స్టాప్ పడింది.

- జిల్లాలో గడిచిన నాలుగేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఉపాధిహామీ పథకంలో పనులు బాగా జరుగుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఉన్నచోటే కూలీలకు పని కల్పిస్తున్నారు.చేతినిండా పని లభించడంతోపాటు ఆర్థిక పురోభివృద్ధిని సాధిస్తున్నారు.నాలుగేళ్లలో 5.47 కోట్ల పనిదినాలు జిల్లాలో ప్రభుత్వం కల్పించింది. ఇందుకుగాను వేతన జీవులకు రూ.1241.01 కోట్లు చెల్లించింది. ఉపాధిహామీ పథకం రాకముందు వేతన జీవులు దూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుని జీవనం కొనసాగించే పరిస్థితి ఉండేది. ప్రస్తుత ఆ పరిస్థితికి ఫుల్‌స్టాప్ పడి ఉన్న ఊర్లలోనే ఉపాధి లభిస్తుండడంతో ప్రశాంత జీవితాన్ని గడుపుతూ కుటుంబ పోషణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారు.

జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు

జిల్లాలో మొత్తం జాబ్ కార్డులు 2,41,871 ఉన్నాయి. వీటిలో 1,98,129 జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. వీటి పరిధిలో 3,38,559 మంది వేతన జీవులు పనులను చేస్తున్నారు.

ఒక్కొక్క వేతన దారునికి రూ. 25 వేల వరకు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనికి వెళ్లే వేతన దారులకు వేలాది రూపాయలు ఏటా చేతికందుతోంది. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు లబ్ధి చేకూరుతోంది. ప్రభుత్వం ప్రతి ఏడాది కోట్లాది పని దినాలు కల్పిస్తోంది. ఇందుకోసం కోట్లలో వేతన దారులకు మొత్తాన్ని చెల్లిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2019 నుంచి 5.41 కోట్ల పనిదినాలు ప్రభుత్వం కల్పించింది. పనికి వచ్చిన వేతనదారులకు ఇప్పటివరకు రూ. 1241.01 కోట్లు వేతనం కింద నాలుగేళ్లలో చెల్లించారు. మెటీరియల్ (నిర్మాణ పనులు)కు సంబంధించి రూ. 690.12 కోట్లు చెల్లించారు.

- ఉపాధిహామీ పథకంలో పనికి వచ్చే ప్రతి వేతన జీవికి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. గరిష్ఠంగా రూ. 272 కాగా, వేతన జీవులకు రూ. 240కు పైగా వేతనం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పనిచేసే వారికి గిట్టుబాటు అవుతోంది.

2019 నుంచి ఇప్పటివరకు ఉపాధిహామీలో వెచ్చించిన నిధులు (కోట్లలో)

సంవత్సరం	పని దినాలు	చెల్లించిన మొత్తం	మెటీరియల్ ఖర్చు
2019 -20	1.22	256.31	158.50
2020-21	1.49	351.48	228.04
2021-22	1.39	319.88	186.05
2022-23	0.73	159.44	89.47
2023-24 (ఇప్పటివరకు)	0.64	153.90	28.06



వేతనాల కోసం ఖర్చు చేసింది: రూ.1241.01 కోట్లు
మెటీరియల్ కోసం: రూ.690.12 కోట్లు
జిల్లాలో జాబ్‌కార్డులు: 2,41,871
మొత్తం వేతనదారులు: 4,39,951
యాక్టివ్‌లో ఉన్న జాబ్‌కార్డులు: 1,98,129
యాక్టివ్‌లోని వేతన జీవులు: 3,38,559

గిట్టుబాటు అవుతోంది



ప్రస్తుతం ఉపాధి పనులకు వెళ్లేందుకు ఉత్సాహం కలుగుతోంది. ఏడాదికి రూ. 25 వేల వరకు సొమ్ము లభిస్తోంది.సొంత ఊర్లలోనే పని దొరకడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండటం లేదు.
- ఎస్.మునిశేఖర్, వేల్పుల, వేముల మండలం

ఉన్న ఊర్లోనే పని దొరుకుతోంది



గతంలో పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఉన్న గ్రామ పరిసరాల్లోనే ఉపాధి పనులు చేపట్టడం వల్ల ఆ పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం డబ్బులు కూడా వెంటనే జమ చేస్తుండడంతో ఇబ్బంది లేకుండా ఉంది.
- ఎం.పద్మావతి, వేల్పుల, వేముల మండలం

అన్ని చర్యలు తీసుకుంటున్నాం



గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వేతన జీవులకు పని కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జాబ్ కార్డు కలిగి ప్రతి ఒక్కరికీ ఏటా కోట్లాది పనిదినాలు కల్పిస్తూ వస్తున్నాం. ఇందుకోసం రూ. కోట్లలో వేతనాలు కూడా చెల్లిస్తున్నాం. అన్ని వర్గాల వారు ఉపాధి పనులకు వచ్చి ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తుండడం సంతోషదాయకం.
- పి.యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప

నేడు నిత్యపూజ స్వామి తలనీలాల వేలం పాట

సిద్దవటం: మండలంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానానికి సంబంధించి తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం శుక్రవారం 12.30 గంటలకు స్థానిక శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో బహిరంగ వేలం పాటను నిర్వహించనున్నట్లు ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో 1వతేదీ సెప్టెంబర్ 2023 నుంచి 31వ తేదీ ఆగస్టు 2024 వరకు విడిదినాలు (2023 సంవత్సరం కార్తీక మాసం, 2024 సంవత్సరంలో మహాశివరాత్రి మూడు రోజులు మినహాయించి) స్వామి వారికి భక్తులచే సమర్పించుకొను తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు ఈ బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నామన్నారు. పాటదారులు ధరావత్తు కింద రూ. 1,00,000 డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చుపాటదారుని డిపాజిట్ మినహా మిగిలిన పాటాదారులుకు చెందిన డిపాజిట్ల రుసుమును వాపస్ ఇస్తామన్నారు. ఆసక్తి గలిగిన పాటాదారులు ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్: జిల్లాలోని వివిధ మేనేజ్‌మెంట్‌ల పరిధిలోని పాఠశాలల నుంచి క్రీడా ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వై.రాఘవరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులపైన సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్/పీఈటీ సంతకాలతో కూడిన దరఖాస్తులను ఈనెల 16వ తేదీలోగా ఎస్‌జీఎఫ్ సెక్రటరీకి అందజేయాలని సూచించారు. ఆయా పాఠశాలల నుంచి విద్యార్థులు కనబరిచిన ప్రతిభ ఆధారంగా క్రీడాప్రతిభ పాఠశాలలను ఎంపికచేసి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసే పాఠశాలలను 5 మెన్ కమిటీ ద్వారా నిర్ణయించనున్నట్లు తెలిపారు.

నేషనల్ హైవేగా అప్‌గ్రేడ్ చేయండి

- సబ్‌జైలు-ఇర్కాన్ సర్కిల్‌కు ఫోర్‌లైన్ రహదారి
- తిరుమల ఎక్స్‌ప్రెస్ కొండాపురం వరకూ నడపాలి
- ఆర్మీ ఉద్యోగుల సౌకర్యార్థం జమ్మూ - తావి ఎక్స్‌ప్రెస్ కడపలో నిలపండి
- కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, అశ్వినివైష్ణవలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వినతి



కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో సమావేశమైన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లాలోని ఎన్‌హెచ్-716 భాకరాపేట నుంచి ప్రకాశం జిల్లా ఎన్‌హెచ్-544డి బెస్తవారిపేట వరకు వయా బద్వేల్ ఎన్‌హెచ్-67, పోరుమామిళ్ల ఎన్‌హెచ్-167బి మీదుగా కిలోమీటర్ 0/0 నుంచి 140/00 వరకు జాతీయ రహదారులుగా అప్‌గ్రేడేషన్ జాబితాలో ఈ రహదారిని చేర్చాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని కోరారు. అలాగే ఎన్‌హెచ్-716 (రేణిగుంట-కడప-ముద్దనూరు)కు సంబంధించి వాహనాల రద్దీ దృష్ట్యా కడప సబ్ జైలు (కిలోమీటర్ 123/600) నుంచి ఇర్కాన్ సర్కిల్, కడప (కిలోమీటర్ 137/600) వరకు ఫోర్ లైన్ రోడ్డు గా మార్చడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే నేషనల్ హైవే-716జి లోని ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లి సెక్షన్ రోడ్‌కు సంబంధించి కొన్ని ఆరోపణల వల్ల టెండర్ రద్దు చేశారని, తిరిగి కొత్తగా టెండర్లు ఆహ్వానించలేదని, ఏడాది ఆలస్యం కావడంతో రహదారి దెబ్బతినిపోయిందని, త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. ఎన్‌హెచ్-716జి లోని ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లి సెక్షన్ రోడ్‌కు సంబంధించి పులివెందులలో రెండుచోట్ల రోడ్డు అలైన్‌మెంట్ మార్చవద్దని, రింగ్‌రోడ్డుకు ఇరువైపులా సమానంగా భూమి సేకరించాలని భూయజమానులు కోరుతున్నారని తెలిపారు.

జమ్మూతావి ఎక్స్‌ప్రెస్‌ను కడపలో ఆపాలి

కడప స్టేషన్‌లో రైలు నెంబర్ 22705/06-జమ్మూ తావి ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజ్ ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వీని వైష్ణవకు గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విన్నవించారు. కడప, చుట్టుపక్కల పట్టణాలైన కమలాపురం, ముద్దనూరు, ప్రొద్దుటూరు, కొండాపురం, రాజంపేట, యర్రగుట్ల, బద్వేల్ ప్రాంతాలకు చెందిన అనేక మంది ఇండియన్ ఆర్మీ ఉద్యోగులు ఈ రైలులో తరచూ ప్రయాణిస్తుంటారు, కడప రైల్వేస్టేషన్‌లో ఈ రైలుకు స్టాపేజ్ లేకపోవడంతో ఈ ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరిస్తూ, కడప రైల్వేస్టేషన్‌లో 22705/06 జమ్ము తావి ఎక్స్‌ప్రెస్‌కు రెండు నిమిషాల ఆగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అదేవిధంగా ప్రజల సౌకర్యార్థం 22157/58 చెన్నై-ముంబై మెయిల్ ఎక్స్‌ప్రెస్, 12793/94 రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను కమలాపురం స్టేషన్ లోను స్టాపింగ్ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. అలాగే 17215/16 ధర్మవరం-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ను, 22157/58 చెన్నై-ముంబై మెయిల్ ఎక్స్‌ప్రెస్‌ను ముద్దనూరు స్టేషన్‌లో ఆపాలని కోరారు, తద్వారా రైల్వేశాఖకు గణనీయమైన ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

మొబైల్ కనెక్టవిటీ పెంచండి...

వైఎస్సార్ జిల్లాలోని దాదాపు 26 మండలాలకు మొబైల్ కనెక్టివిటీ ఇప్పటికీ లేదని, దీంతో గ్రామస్తులు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోలేకపోతున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా మండలాలకు అన్‌కవర్డ్ విలేజ్ ప్రాజెక్ట్ కింద యుఎస్‌ఓఎఫ్ సపోర్టెడ్ స్కీమ్ ద్వారా కొత్త 4జి టవర్ లను మంజూరు చేస్తూ, మొబైల్ కనెక్టివిటీ సేవలను అందించాలని కోరారు. కడప-విశాఖపట్నం మధ్య నడిచే రైలు నెం. 17487/88 తిరుమల ఎక్స్‌ప్రెస్ 'కడప'చేరుకున్న తర్వాత, కడపస్టేషన్‌లో సరైన స్టేషన్ సర్వీస్ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో, కొండాపురం వరకు ఖాళీ బోగీలతో 85 కి.మీ ప్రయాణించి తిరిగి కడపకు వస్తుంది. దీని వల్ల రైల్వేకు ఇంధనం వృథాతోపాటు ఎక్కువ సమయం పోతుంది. ఈ విషయాన్ని పరిశీలించి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును కొండాపురం వరకు పొడిగించి కమలాపురం, యరగ్రుంట్ల, ముద్దనూరు మధ్య స్టాప్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా ఎటువంటి నష్టం లేకపోగా, రైల్వేశాఖకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కడప నుంచి బెంగళూరు వరకు కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణం ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, అలైన్‌మెంట్ సవరణను వీలైనంత త్వరగా పరిశీలించి ఆమోదించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్రమంత్రికి విన్నవించారు.

ఇంటింటి సర్వే వేగవంతం: కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఇంటింటి సర్వే వేగవంతం చేశామని కలెక్టర్ విజయరామరాజు రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి ముఖేష్ కుమార్‌మీనాకు తెలిపారు. గురువారం రాష్ట్ర సీఈఓ కలెక్టర్లు, జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల 21వ తేదీ నాటికి సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డూప్లికేట్ ఓటర్లు, వలస వెళ్లిన వారు, మరణించిన వారు, వివాహమై వేరే ఊర్లకు వెళ్లిన వారు, డబుల్ ఎంట్రీలు తొలగించాలన్నారు. ఫారం-6, 7, 8 లపై వచ్చిన గ్రీవెన్స్‌సెస్ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్: ఉర్దూ అకాడమీ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్తాధ్వర్యంలో మైదుకూరు పట్టణంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నా మని ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఎస్.అయ్యుబ్ హుసేన్ తెలిపారు. ఈనెల 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 36 ఉర్దూ అకాడమీ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఈ వివరాలకు డోర్ నెంబరు 12- 42, శివునిమన్యం వీధి, ఆర్టీసీ బస్టాండు వద్ద, మైదుకూరులో సంప్రదించాలన్నారు.

హెచ్‌ఎంలు ప్రోగ్రెస్ కార్డులు తీసుకెళ్లాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు 2023-24 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు సంబంధించిన ప్రొగ్రెస్‌కార్డులను కడప సీఎస్ఐ హైస్కూల్‌లో ఉన్న డీసీఈబీకి వచ్చి తీసుకెళ్లాలని డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య తెలిపారు. ప్రొగ్రెస్ కార్డులకు వచ్చే ప్రధానోపాధ్యాయులు తరగతి, మీడియం వారీగా విద్యార్థుల సంఖ్యకు సంబంధించిన వివరాలు తప్పక సరిగా తీసుకుని రావాలన్నారు.

అతివలకు ఆలంబన

సున్నా వడ్డీ బకాయిల చెల్లింపునకు ఏర్పాట్లు పూర్తి



కడప కార్పొరేషన్/రూరల్: ప్రజా సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలను ప్రవేశపెడుతూ వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అందరిమన్ననలను అందుకుంటోంది. స్వయం సహాయ సంఘాల అక్క చెల్లెమ్మలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రజా సంకల్పయాత్రలో చూసి చలించిపోయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని నవరత్నాల పథకంలో చేర్చారు. మహిళలు తీసుకున్న రుణానికి ఎలాంటి వడ్డీ పడకుండా ప్రభుత్వమే చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. శుక్రవారం అక్కచెల్లెమ్మల ఖాతాల్లో సున్నావడ్డీ జమ కాబోతోంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వారి కుటుంబాలు సంతోషంగా ఉంటున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సకాలంలో వాయిదాలు చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ పథకం వర్తించనుంది. సంఘం అప్పు నిల్వలో గరిష్ఠంగా రూ.3లక్షల వరకు మాత్రమే సున్నావడ్డీ వర్తిస్తుంది. క్యాష్ క్రెడిట్ లిమిట్ ద్వారా అప్పు పొందిన సంఘాలు ప్రతినెలా, గత నెలాఖరు నాటికి ఉన్న అప్పు నిల్వలో కనీసం 3 శాతం ప్రస్తుత నెలలో చెల్లించి ఉండాలి. ఒకవేళ టర్మ్ లోన్ అయితే ఏ నెలలో ఎంత ఈఎంఐ చెల్లించాలో అంత ఆ నెలాఖరు నాటికి చెల్లించి ఉండాలి. వైఎస్సార్‌సున్నా వడ్డీ అర్హతను ప్రతనెలా ధృవీకరించి లెక్కించడం జరుగుతుంది. వాయిదా బకాయి ఉన్న సంఘాలు బకాయిలు పూర్తిగా చెల్లించిన పిదప మాత్రమే సున్నావడ్డీకి అర్హత పొందుతాయి. ఏ నెలలో అయితే బకాయిలు పూర్తిగా చెల్లిస్తారో ఆనెలకు మాత్రమే సున్నావడ్డీని పొందుతారు. ప్రస్తుత అప్పు నిల్వ, అప్పు మంజూరైన మొత్తానికి సమానంగా గాని, లేక తక్కువగా గాని ఉన్న సంఘాలు మాత్రమే అర్హత పొందుతాయి.

- వైఎస్సార్ సున్నా వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా స్వయం సహాయక సంఘం అప్పు ఖాతాకు జమ చేస్తుంది. ఒకవేళ అప్పుఖాతా క్లోజ్ అయితే సంఘం పొదుపు ఖాతాకు జమ చేస్తారు.
- వైఎస్సార్ సున్నావడ్డీ కార్యక్రమాన్ని నాలుగో సంవత్సరం కూడా కొనసాగిస్తూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు, ఆ సంవత్సరం తీసుకున్న కొత్త రుణాలకు కూడా సున్నా వడ్డీ రుణాలను విడుదల చేయనున్నారు. ఈ పథకం కింద జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని 25727, పట్టణ ప్రాంతాల్లోని 11849 సంఘాల చొప్పున మొత్తం 37576 సంఘాల్లోని 399795 సభ్యులకు రూ.57.45 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాలకు చెల్లించనున్నారు.

సక్రమంగా రుణం చెల్లించే సంఘాలకే వడ్డీ



ప్రతి నెలా సక్రమంగా రుణాలు చెల్లిస్తూ గరిష్ఠంగా రూ.3లక్షలు రుణం తీసుకున్న స్వయం సహాయ సంఘాల సభ్యులందరికీ సున్నా వడ్డీ పథకం ద్వారా రాయితీ పడుతుంది. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థికంగా, వ్యాపార పరంగా అభివృద్ధి చెందాలి.
- ఆనంద్ నాయక్, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

క్లుప్తంగా

ఎన్‌జీ రంగా యూనివర్సిటీ బోర్డు మెంబర్‌గా డాక్టర్ సుధ



బద్వేలు అర్బన్ : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలిగా బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ నియమితులయ్యారు. గత పాలక మండలి పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో 15 మందితో కూడిన నూతన పాలక మండలిని గురువారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాల్‌క్రిష్ణద్వివేది ప్రకటించారు. ఇందులో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధను పాలక మండలి సభ్యురాలిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అలాగే తనపై నమ్మకంతో పాలక మండలి సభ్యురాలిగా నియమించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్‌సీఐ మెంబర్‌గా సుధీర్‌కుమార్‌రెడ్డి



కేంద్రమంత్రి పశుపతి కుమార్ పారస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సుధీర్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : కన్సల్టేటివ్ కమిటీ ఆఫ్ ఫుడ్ కార్పొరేషన్ (ఎఫ్‌సీఐ) మెంబర్‌గా ప్రొద్దుటూరుకు చెందిన కమలకురు సుధీర్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం ఢిల్లీలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రి పశుపతి కుమార్ పారస్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఎఫ్‌సీఐ మెంబర్‌గా నియమించిన కేంద్ర మంత్రి పశుపతి కుమార్ పారస్, పీయుష్ గోయల్‌కు సుధీర్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గురప్పస్వామి హుండీ ఆదాయం రూ. 7,62,195

పోరుమామిళ్ల : ప్రసిద్ధ ఆలయం శ్రీ మద్దిమాను గురప్పస్వామి దేవస్థానం హుండీలోని భక్తుల కానుకలను గురువారం లెక్కించగా రూ. 7,62,195లు వచ్చింది. ఇది 132 రోజుల్లో భక్తులు హుండీలో వేసిన డబ్బు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ నరసయ్య, అర్చకులు వేణుస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వీస్ ఇనామ్ భూములు క్రమబద్ధీకరణ

- 2013 చట్ట సవరణలు ఈ రైత్వారీ పట్టాలకు వర్తించవు
- రెవెన్యూ రికార్డుల్లోకి పట్టాదారుల పేర్లు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



కడప సెవెన్ రోడ్స్ : చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఇప్పటికే విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సర్వీస్ ఇనామ్ భూములను సైతం 22ఏ జాబితా నుంచి తొలగించింది. ఈ మేరకు జారీచేసిన జీఓ.ఎం.ఎస్. నెంబర్ 310 తేదీ : 19/7/2023 కలెక్టరేట్‌కు వచ్చింది. గ్రామ సర్వీస్ ఇనామ్ భూములకు గతంలో జారీ చేసిన రైత్వారీ పట్టాలు చెల్లుబాటు అవుతాయని, వాటిని 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ఇనామ్ (రద్దు, రైత్వారీ పట్టాలుగా మార్పు)– 1956 చట్టానికి 2013లో చేసిన సవరణలు ఈ గ్రామ సర్వీస్ ఇనామ్ భూముల రైత్వారీ పట్టాలకు వర్తించవని స్పష్టం చేసింది. ఈ భూములకు గతంలో ఇచ్చిన రైత్వారీ పట్టాదారుల పేర్లను అన్ని రెవెన్యూ రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

పట్టాదారులు లేకపోతే వారి వారసులు (లీగల్ హైర్స్)ఎక్కించాలి. ఒకవేళ వీరు ఇతరులకు విక్రయించి ఉంటే కొనుగోలు చేసిన వ్యక్తుల పేర్లను రికార్డులలో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. అలాగే రీసర్వే రికార్డులలో కూడా వారి పేర్లు చేర్చాలని పేర్కొంది. అంటే ఈ భూములను ఇకపై క్రయ, విక్రయాలు చేసుకోవచ్చు. 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించడం వల్ల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి అవరోధాలు ఉండవు. సర్వీస్ ఇనాము భూములకు ఇచ్చిన రైత్వారీ పట్టాలను ఇనాముదారుల నుంచి తాము కొనుగోలు చేశామని, అయితే అధికారులు తమ పేర్లను రెవెన్యూ రికార్డులలోకి ఎక్కించడం లేదంటూ అనేకమంది రైతులు రీసర్వే సందర్భంగా ప్రభుత్వానికి ఫిర్యాదులు సమర్పించారు. దీంతో ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చింది. నిషేధిత జాబితా నుండి గ్రామ సర్వీస్ ఇనాము భూములకు ఇచ్చిన రైత్వారీ పట్టాలను తొలగించాలనే సాహసోపేత నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. ఉమ్మడి కడప జిల్లాలో 184 రెవెన్యూ గ్రామాలలో 2,15,882 ఎకరాల సర్వీస్ ఇనాము భూములు ఉన్నాయి. వీటిని అనుభవించుకుంటున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అంటున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులపట్ల రైతులలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గ్రామ సర్వీస్ ఇనామ్‌లు..

గ్రామీణ ప్రాంతాలలో చాకలి, మంగలి, మాదిగ, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి తదితరులు ప్రజలకు సేవలు అందించేవారు. వీరి జీవనాధారం కోసం ఇనాము కింద వ్యవసాయ భూములు ఇచ్చారు. వీటిని గ్రామ సర్వీస్ ఇనాము భూములు అంటారు. సేవలు చేస్తున్నంత కాలం మాత్రమే ఈ భూములను అనుభవించుకునే హక్కు వారికి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఇనామ్ (రద్దు, రైత్వారీ పట్టాలుగా మార్పు) చట్టం 1956 వచ్చింది. దీంతో కొన్ని ఇనాము భూములు రద్దయి రైత్వారీ భూములుగా మారాయి. ఈ భూములకు రెవెన్యూ అధికారులు గతంలో రైత్వారీ పట్టాలు జారీ చేశారు.

ఇకపోతే పూర్వం రాజులు, సేవా సంస్థలు, ఆధ్యాత్మిక భావంగల సంపన్నులు దేవాలయాలు, ధార్మిక సంస్థల నిర్వహణ కోసం భూములు ఇచ్చారు. పూజారులు, మేళ వాయిద్యకారులు, నైవేద్యం కోసం పాలు సమర్పించేందుకు ఆవులు మేపేవారు, ఇంకా పలు సేవలు అందించే వారు అనుభవించుకోవడానికి మాత్రమే ఈ భూములు ఇచ్చారు. కాలక్రమంలో ఏ సేవల కోసం భూములు ఇచ్చారో ఆ సేవలు కూడా ఇప్పుడు మనుగడలో లేవు. ఈ భూములు క్రమంగా ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

2013 చట్ట సవరణతో నిషేధిత జాబితాలోకి..

దేవాలయ, ధార్మిక సంస్థల మనుగడ కోసం ఇచ్చిన ఇనాముల భూముల అంశం సుప్రీం కోర్టుకు వెళ్లింది. సేవలు అందిస్తున్నంత వరకు మాత్రమే ఈ భూములను అనుభవించుకునే హక్కు ఉంటుంది. కనుక వీటికి రైత్వారీ పట్టాలు చెల్లవని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. దీంతో ఈ భూముల రక్షణ కోసం 2013లో ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇనామ్ (రద్దు, రైత్వారీ పట్టాలుగా మార్పు) చట్టం 1956కు సవరణ చేసింది. ఈ ఇనాము భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. అయితే వీటితోపాటు గ్రామ సర్వీసు ఇనాములకు జారీ చేసిన రైత్వారీ పట్టాల భూములు కూడా 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి. దేవాలయ ఇనామ్‌లకు, గ్రామ సర్వీసు ఇనామ్‌ల మధ్య ఉన్న తేడాపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. దేవాలయాలు, ధార్మిక సంస్థలలో సేవలందించడానికి ఇచ్చిన ఇనాము భూములు ఎప్పటికీ ఆ సంస్థలకే చెందుతాయి తప్ప.. ఇతర వ్యక్తులు పొందడానికి అవకాశం ఉండదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఇకపోతే ఇప్పుడు గ్రామ సర్వీసు ఇనాములకు గతంలో ఇచ్చిన రైత్వారీ పట్టాలను నిషేధిత జాబితా నుంచి తొలగించింది. వీటి వివరాలతో కూడిన జాబితాలను రెవెన్యూ అధికారులు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపుతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్‌లకు మార్గం సుగమం అవుతోంది.

ల్యాప్‌టాప్ అప్పగింత



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందిస్తున్న ధారా సంతోష్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన వెంకటేశ్వరస్వామి భక్తులు తిరుమలకు పాదయాత్రగా ఆదివారం బయల్దేరారు. బుధవారం రాత్రి రైల్వేకోడూరు సమీపంలో వారు వెళుతుండగా ధారా సంతోష్, నాగరాజేష్‌లకు ల్యాప్‌టాప్ బ్యాగ్ కనపడటంతో దానిని తీసుకున్నారు. అందులో ల్యాప్‌టాప్, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాల విద్యార్థి సుమంత్ కుమార్‌కు చెందిన ఐడీ కార్డు ఉండటంతో అతనికి ఫోన్ చేశారు. అతను రైల్వేకోడూరుకు వచ్చి వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్ తీసుకున్నారు. సంతోష్, నాగరాజేష్‌లకు విద్యార్థి కృతజ్ఞతలు తెలిపాడు.

జేసీబీతో పాటు మూడు ట్రాక్టర్లు సీజ్

అట్లూరు : జేసీబీతో పాటు మూడు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ కె.సి.రాజు తెలిపారు. ఆయన వివరాల మేరకు అట్లూరు క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం ఉదయం ఎలాంటి అనుమతులు లేకుండా మూడు ట్రాక్టర్లతో పాటు జేసీబీ మట్టిని తరలిస్తుండగా వాటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ విషయమై బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారికి సమాచారమిచ్చామని తెలిపారు.ఈ వాహనాల యజమానులు రెవెన్యూ డివిజనల్ అధికారి నుండి రిలీజ్ ఆర్డర్ తీసుకువస్తే విడుదల చేస్తామన్నారు.

రైలు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ డీఎస్‌ఓ చంద్రశేఖర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైలు ప్రమాదాలు జరగకుండా నిరంతరం అధికారులు అప్రమత్తంగా ఉండాలని గుంతకల్లు సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌ఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కడప రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ డీఎన్ రెడ్డి అధ్యక్షతన సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రైలు ప్రమాదాలు తరచూ జరుగుతుండడం బాధాకరమన్నారు. కడప రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి కడప–నంద్యాల డెమో రైలు పట్టాలు తప్పడంతో త్వరలో విచారణకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తారని తెలిపారు. రైలు ప్రమాదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఆపరేటింగ్, సిగ్నల్, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ శాఖల సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలన్నారు. రైలు ప్రమాదాలు జరిగితే అందుకు బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తొలుత ఆయన నంద్యాల డెమో రైలు పట్టాలు తప్పిన ప్రదేశాన్ని గుంతకల్లు డివిజనల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎస్‌ఓ చంద్రశేఖర్, డీఈఈ వీరయ్య, ఏడీఎస్‌టీసీ కాత్యాకుమార్, ఏడీఈఎన్ రాధాకృష్ణ, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సలాం.. పోలీస్.!

ప్రాణాలను కాపాడిన ట్రాఫిక్ ఏఎస్‌ఐ



వర్షపు నీటిలో కింద పడిపోయిన జాఫర్‌వలీని కాపాడే ప్రయత్నం చేస్తున్న ఏఎస్‌ఐ సుబ్బన్న



ఏఎస్‌ఐ సుబ్బన్నను హత్తుకొని కృతజ్ఞతలు తెలుపుతున్న జాఫర్‌వలీ

ప్రొద్దుటూరు క్రైం : ఓ ట్రాఫిక్ ఏఎస్‌ఐ వృద్ధుడి పాలిట ఆపద్బాంధవుడిగా మారారు. సమయస్ఫూర్తి ప్రదర్శించి అతని ప్రాణాలు నిలబెట్టారు. తెగిపడిన విద్యుత్ తీగ తగులుకుని షాక్‌కు గురై రోడ్డుపై పడిపోయిన వృద్ధుడిని కాపాడి మానవత్వాన్ని చాటారు.

ఏమైందంటే..

ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన గోల్కొండ జాఫర్‌వలీ గురువారం ఉదయం సుందరాచార్యులవీధిలోని మసీదుకు నమాజ్‌కు వెళ్లాడు. తిరిగి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా గాంధీ రోడ్డులోకి రాగానే తెగి వేలాడుతున్న విద్యుత్ లైన్ తగులుకొని రోడ్డులోని వర్షపు నీటిలో అపస్మారక స్థితిలో పడిపోయాడు. చుట్టూ వర్షపు నీరు ఉండటమే గాక అతనిపై విద్యుత్ తీగ వేలాడుతుండటంతో భయపడిన ప్రజలు సాయపడేందుకు ముందడుగు వేయలేకపోయారు. అయితే మార్నింగ్ వాక్ చేసేందుకు అదే రోడ్డులో వెళ్తున్న ట్రాఫిక్ ఏఎస్‌ఐ సుబ్బన్న జరిగిన విషయాన్ని తెలుసుకొని హుటాహుటిన అక్కడికి వెళ్లారు. మలేరియా విభాగంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుడు దినేష్ సాయంతో ఏఎస్‌ఐ కర్ర తీసుకొని విద్యుత్ లైన్‌ను పక్కకు తొలగించారు. సపర్యలు చేసి అతన్ని ఆస్పత్రికి తరలించారు. తర్వాత బంధువులను పిలిపించారు. కొద్దిసేపటికి జాఫర్‌వలీ కోలుకున్నాడు.

ఆ దేవుడు పంపిన మనుషులు మీరు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితుడి వివరాలు తెలుసుకునేందుకు సాయంత్రం ఏఎస్‌ఐ సుబ్బన్న వృద్ధుడు జాఫర్‌వలీ ఇంటివద్దకు వెళ్లారు. ఇతన్ని చూస్తూనే.. సార్.. నీరసం తగ్గాక నేనే మీ వద్దకు వచ్చి కృతజ్ఞతలు చెప్పాలనుకున్నా.. అంతలోపు మీరే మా ఇంటివద్దకు వచ్చారు. నిజంగా మీరు నా ప్రాణాలు కాపాడేందుకు దేవుడు పంపిన మనుషులు.. మీ మేలు ఎప్పటికీ మరువలేను.. అంటూ ఆ వృద్ధుడు ఏఎస్‌ఐను ఆలింగనం చేసుకున్నాడు. కాగా ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన ఏఎస్‌ఐ సుబ్బన్నను జిల్లా ఎస్పీ అన్బురాజన్, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణా కుమార్ అభినందించారు.

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి సి.ఆదినారాయణరెడ్డి కోరారు. రాష్ట్ర పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట బీజేపీ నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 13 వేల గ్రామాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 8 వేల కోట్లను విడుదల చేసిందన్నారు. జల జీవన్ మిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా 50 శాతం నిధులు ఇవ్వాలని కోరారు. విద్యుత్ కోతల నుంచి గ్రామాలను ఆదుకోవాలన్నారు. ఉపాధి పనుల నిర్వహణ కోసం కేంద్ర నిధులు ఖర్చు చేయాలన్నారు. డ్రిప్, ట్రాక్టర్లకు సబ్సిడీ మంజూరు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రహదారులకు మరమ్మతులు నిర్వహించి అవసరమైనచోట్ల కొత్త రాష్ట్ర రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వంగల శశిభూషణరెడ్డి, సింగారెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కడపలో భారీ అగ్ని ప్రమాదం



కడప మండీబజార్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మైదుకూరులోఉపాధ్యాయుడి ఇంటిలో కాలిపోయిన ఎయిర్ కండిషనర్ పరికరం

- 5నుంచి 6 గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది
- దాదాపు రూ. 2 కోట్ల మేర ఆస్తినష్టం

కడప అర్బన్ : కడప నగరంలోని మండీబజార్‌లో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ నిత్యావసర వస్తువుల హోల్‌సేల్ దుకాణంలో గురువారం తెల్లవారుజామున 1–2 గంటల మధ్య భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణంలో నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే కడప అగ్నిమాపక కేంద్రం అధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది సంఘటన స్థలానికి నేరుగా చేరుకున్నారు. మంటలను దాదాపు 5–6 గంటల సేపు శ్రమించి పూర్తిగా ఆర్పివేశారు. ఈ సంఘటన విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ ద్వారా సంభవించిందని భావిస్తున్నారు. ఈ దుకాణం యజమాని బద్రీనాథ్ బుధవారం రాత్రి 10 గంటల సమయంలో తన దుకాణాన్ని మూసేసి ఇంటికి వెళ్లారు. ఈ సంఘటనలో మూడంతస్తుల భవనం కావడం, మొత్తం నిత్యావసర వస్తువులతో పాటు, నూనె సామగ్రి కూడా ఎక్కువగా ఉండటంతో మంటలు క్షణాల్లో వ్యాపించాయి. ఈ సంఘటనలో దాదాపు రూ. 2కోట్ల మేర ఆస్తినష్టం సంభవించి ఉంటుందని దుకాణం యజమాని బద్రీనాథ్, ఆయన కుమారుడు వెంకటేష్‌లు విలేకరులకు తెలిపారు. ఈ సంఘటనలో అగ్నిమాపక సిబ్బంది కృషిని జిల్లా సహాయ అధికారి బసివిరెడ్డి అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పరికరాలు దగ్ధం

మైదుకూరు : పట్టణంలోని వైఎస్ నగర్‌లో కె.నరసింహరాజు అనే ఉపాధ్యాయుడి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి. ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లడంతో ఆయన ఒక్కరే ఇంటిలో ఉంటున్నారు. బుధవారం ఆయన పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి తలుపులు తీయగా ఇంటిలో ఏసీ పరికరం నుంచి మంటలు వస్తుండటం కనిపించింది.

మంటలను ఆర్పి వేసేందుకు ప్రయత్నించేలోపే ఏసీ పూర్తిగా కాలిపోయి ఇంటిలోని డబుల్ కాట్ మంచం ఇతర వస్తువులకు మంటలు వ్యాపించి ఇళ్లంతా దట్టమైన పొగ అలుముకుంది. మంటలు ఆర్పేందుకు వీలు కాలేదని ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు తెలిపారు. స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సంఘటనలో సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపారు.


ప్రభుత్వ బడిలోనే చదివించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అభివృద్ధి చేసిందని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని తల్లిదండ్రులకు సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పేరెంట్–టీచర్స్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన ఫార్మెటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కులను తల్లిదండ్రులకు ప్రదర్శించారు. అలాగే పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. పేరెంట్– టీచర్స్ కమిటీ సమావేశంలో భాగంగా కడప మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. అలాగే కోట్ల రూపాయలు పెట్టి నాడు– నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప మండల ఎంఈఓ పాలెం నారాయణ, హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ కార్యక్రమాన్ని పరిశీలించిన కేంద్ర బృందం



లింగాల కొత్త చెరువు వద్ద కేంద్ర బృంద సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది

లింగాల : నా భూమి – నాదేశం కార్యక్రమంలో భాగంగా లింగాల మండల కేంద్రంలోని కొత్త చెరువు సమీపంలో ఆజాదీకా అమృత్ సరోవర్ వద్ద నిర్వహిస్తున్న కార్యక్రమాలను కేంద్ర బృందం గురువారం పరిశీలించింది. చెరువు వద్ద నిర్మిస్తున్న అమరవీరుల స్మారక బోర్డును, మొక్కలు నాటే కార్యక్రమాలను వారు పరిశీలించారు. డాక్యుమెంట్ల రైటర్ సీఆర్‌డీ డాక్టర్ లీలావతి, ఉపాధి హామీ ఏపీడీలు ఆనంద్, సుబ్బారెడ్డి, లింగాల ఏపీఓ లావణ్య, ఉపాధి హామీ ఇంజినీర్ గంగరాజు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువను పట్టుకున్న అటవీ శాఖ అధికారులు



ఇప్పెంట గ్రామంలో సంచరిస్తున్న కొండ చిలువను పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట గ్రామంలో కొండ చిలువ సంచరించడంతో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. బుధవారం తమ గ్రామంలో కొండ చిలువ సంచరిస్తోందని గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భైరవ, స్నేక్ క్యాచర్ నటరాజ్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో కొండ చిలువను పట్టుకొని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలి వేశారు. ఈ కొండ చిలువ దాదాపు 12 అడుగులు ఉంటుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. కొండ చిలువను ముళ్ల పొదళ్ల నుంచి బయటకు తీసేందుకు అటవీ శాఖ అధికారులు శ్రమించారు.

ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ మోసాలు



కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతూ అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకుని రూ. లక్షలు దోచుకుంటున్నారని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి అనుమానం రాకుండా సైబర్ నేరగాళ్లు తాము కలెక్టర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెబుతారన్నారు. తెలుగుభాషలో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేరిట డ్వాక్రా మహిళలకు వారు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోందని, మీ ఖాతాలో కొంత నగదు నిల్వ ఉంచాలని డ్వాక్రా మహిళలకు ఫోన్ చేసి చెబుతారని ఎస్పీ వివరించారు. తమ ఫోన్‌'పే'ఖాతాలో నగదు నిల్వ లేదు అని మహిళలు చెబితే ప్రభుత్వం డబ్బులు ఇస్తామన్నా.. ఖాతాలో డబ్బులు లేకపోవడం ఏంటని అమాయక మహిళలను కించపరిచేలా మాట్లాడతారన్నారు. డ్వాక్రా గ్రూప్‌లో మీకు తెలిసిన ఇతర సభ్యులను కాన్ఫరెన్స్ కాల్ ద్వారా కలిపి మాట్లాడించాలని చెప్పి డబ్బులున్న ఖాతాల్లోకి మార్చుకుని దోచుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎస్పీ తెలిపారు. అంగన్‌వాడీ మహిళల ఫోన్ నెంబర్లను సేకరించి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. ఇలాంటి మోసగాళ్ల బారినపడి కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితుల ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.జీవోవీ. ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్.సి.ఆర్.పి)లో, టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.